

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని


PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.





విజయవాడ ఆదివారం 30-08-2026 సంపుటి: 02 సంచిక : 58 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Sunday, 30-08-2026 Volume :02 Issue: 58 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani

Contact Number 9059328777

## సీఎంలు బంగారం... ఎమ్మెల్యేలు బ్యాడ్..!


02

- యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో సర్వేలు వెల్లడి
- యోగి సర్కారుపై 41.8 శాతం ఓటర్లు సంతృప్తి
- యూపీ ఎమ్మెల్యేలపై 49 శాతం అసంతృప్తి
- మళ్లీ సీఎంగా యోగికి 43 శాతం మద్దతు
- పంజాబ్‌లో మాన్ సర్కారుపై 40 శాతం సంతృప్తి
- ఎమ్మెల్యేలపై 45.3 శాతం అసంతృప్తి
- మళ్లీ సీఎంగా మాన్ వైపు పంజాబ్ ఓటర్లు మొగ్గు
- ఉత్తరాఖండ్‌లో సగం మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి
- వచ్చే ఏడాది మూడు రాష్ట్రాలకు ఎన్నికలు

## నేపాల్‌లో హృదయ విదారకం


02

- బురద మేటలు.. ఆరని కన్నీళ్లు!
- ఒక్కొక్కరిది ఒక్కోవిషాద గాథ
- వరద మృతులు 682
- 2,426 మంది గల్లంతు
- పునర్ నిర్మాణానికి 5 బిలియన్ డాలర్లు
- భారత్, చైనాలు సాయం చేయాలి
- నేపాల్ ఆర్థిక మంత్రి అభ్యర్థన

# గిరిజన ఆరోగ్యానికి సంజీవని

### సంజీవనితో గిరిజన ఆరోగ్యానికి భరోసా


- రూ.250 కోట్లతో గిరిజన ఆరోగ్య మౌలిక వసతుల మిషన్
- మారుమూల ప్రాంతాలకూ వైద్య సేవలు చేరువ చేస్తాం
- రేపు వెలిగొండకు కృష్ణాజలాలు
- 2న అనకాపల్లికి గోదావరి జలాలు
- ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి ఐదు సూత్రాలతో కార్యాచరణ
- డ్రోన్లతో అత్యవసర ఔషధాలు, వ్యాక్సిన్ల సరఫరా
- గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు
- కల్తీ మద్యంతో ప్రజారోగ్యానికి నష్టం
- గ్రూప్ 1 అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారు
- గత పాలనలో ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం
- ఏకగ్రీవాలపై గతంలో ఒక మాట.. ఇప్పుడు మరో మాట
- అరకు నియోజకవర్గం గన్నెలలో సంజీవని కార్యక్రమాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

**సంజీవని ప్రాజెక్టుతో ఆరోగ్య సేవల్లో మరో ముందడుగు**




అరకు,

మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. వైద్యం కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా.. వైద్య సేవలనే వారి చెంతకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వ్యక్తిగత డిజిటల్ ఆరోగ్య రికార్డులు రూపొందించే సంజీవని ప్రాజెక్టును త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. అరకు లోయ నియోజకవర్గంలోని గన్నెలలో సంజీవని ప్రాజెక్టు అమలు తీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం -మిగతా 2 లో


02

## సినీ కార్మికులకు ఏఐ దెబ్బ

- జూనియర్ ఆర్టిస్టుల అవకాశాలను మింగేస్తున్న ఏఐ
- 300 మంది అవసరమైన సీన్‌కు 60 మందితోనే షూటింగ్
- డిజిటల్ జనసమూహాలతో పెరుగుతున్న వీఎఫ్ఎక్స్ వినియోగం
- రోజువారీ కూలీపై ఆధారపడే సినీ కార్మికులకు కొత్త కష్టం
- చిన్న పాత్రలే పెద్ద నటులుగా ఎదిగే మార్గానికి ముప్పు
- 'రామాయణ' ట్రైలర్‌తో వెలుగులోకి వచ్చిన డిజిటల్ క్రౌడ్
- తెరపై జనసందోహం.. సెట్లో మాత్రం కొద్దిమందే
- టెక్నాలజీ మార్పులతో ఉపాధి కోల్పోయే భయం



## వైసీపీలో నంబర్ 1 సజ్జల

- జగన్ ఏ-2గా మారిపోయారు
- విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నమ్మకద్రోహిని కాదు గనుకే 15 నెలలు జైల్లో ఉన్నా
- కాంగ్రెస్‌తో సంధి చేసుకుని కేసులు, ఛార్జ్‌షీట్లలో పేర్లు లేకుండా తప్పించుకున్న సజ్జల
- వైసీపీ సోషల్ మీడియాపై ఆగ్రహంతో మాజీ ఎంపీ బహిరంగ లేఖ

అమరావతి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ లో నంబర్ టు అని, ఆ పార్టీ నంబర్ వన్ సజ్జల రామకృష్ణారెడ్డి అంటూ విజయ సాయి రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. తాను నమ్మక ద్రోహి అని వైసీపీ సోషల్ మీడియాలో విమర్శించడాన్ని ఖండిస్తున్నట్లు విజయ సాయి ప్రకటించారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ లో వైసీపీ లో తనకు జరిగిన అవమానాలు, ఎదుర్కొన్న ఇబ్బందులు, దెబ్బతిన్న ఆత్మ గౌరవం ప్రస్తావిస్తూ బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పై విజయసాయి తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ -మిగతా 2 లో



## హామీల అమలుకే ప్రథమ ప్రాధాన్యం

- పిఠాపురం ఆరోగ్య రంగానికి సరికొత్త రూపు
- పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఆసుపత్రుల అభివృద్ధి
- ఆయుష్ సేవల విస్తరణ.. వైద్య విద్యకు కొత్త ఊపిరి
- రూ.34 కోట్లతో ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ
- సుమారు రూ.100 కోట్లతో ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాల
- రూ.కోటితో కొమరగిరి, చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- విరవాడలో తుది దశకు చేరిన ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీ
- ఆసుపత్రులకు అనుసంధానంగా కనెక్టింగ్ రోడ్ల నిర్మాణం

పిఠాపురం,

నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అనే లక్ష్యంతో పిఠాపురం నియోజకవర్గాన్ని సమగ్ర ఆరోగ్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పేద, సామాన్య ప్రజలకు ఆర్థిక భారం లేకుండా అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రుల ఆధునికీకరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, ఆయుష్ వైద్య సేవల విస్తరణ, వైద్య విద్యా సంస్థల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఆసుపత్రులకు అనుసంధాన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

-మిగతా 2 లో


## ఖర్గే ర్యాలీ చేసిన ప్రదేశంలో శుద్ధి

- అంటరానితనానికి నిదర్శనమన్న కాంగ్రెస్ అగ్రనేత
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరిపై తీవ్ర విమర్శలు
- ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్
- నిందితులపై చర్యలకు ప్రధాని చొరవ చూపాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరిన రాహుల్
- చర్యలు లేకుంటే మరింత తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరిక

న్యూడీల్లి

కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఒక ర్యాలీ కోసం ఖర్గే పాల్గొన్న వేదికను శుభ్రం చేయడాన్ని రాహుల్ తప్పుబట్టారు. అలా చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. -మిగతా 2 లో





02

## ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- డ్రోన్ దాడితో భారీ విధ్వంసం
- కీవ్ ప్రాంతంలో 37 మంది మృతి, 42 మందికి గాయాలు
- పిల్లలు సహా వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- నివాస భవనాలు, దుకాణాలు, వాహనాలకు తీవ్ర నష్టం
- రష్యాకు శిక్ష తప్పదని జెలెన్స్కీ హెచ్చరిక
- అత్యవసర సహాయక చర్యలు ని ముమ్మరం చేసిన ఉక్రెయిన్ ప్రభుత్వం

# సీఎంతో విభేదాల్లేవ్

### రాహుల్‌ను ప్రధానిని చేయడమే మా ఇద్దరి లక్ష్యం

- సీఎంపై సుస్మిత వ్యాఖ్యలు బాధ కలిగించాయి
- కొండా సురేఖ, చిన్నారెడ్డిపై నిర్ణయం అధిష్టానానిదే
- మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్



హైదరాబాద్,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు విభేదాలు లేవని, ఇద్దరం సమన్వయంతో పార్టీని ముందుకు నడిపిస్తున్నామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్నదే ఇద్దరి లక్ష్యమని చెప్పారు. సీఎంపై కొండా సురేఖ కూతురు సుస్మిత పటేల్ చేసిన విమర్శలు తనకు బాధ కలిగించాయని వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖ, పార్టీ సీనియర్ నేత చిన్నారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అన్ని కోణాల్లో పరిశీలించి -మిగతా 2 లో

# ఉక్రెయిన్‌పై రష్యా దాడి

**-డ్రోన్ దాడితో భారీ విధ్వంసం**
**-కీవ్ ప్రాంతంలో 37 మంది మృతి, 42 మందికి గాయాలు**
**-పిల్లలు సహా వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు**
**-నివాస భవనాలు, దుకాణాలు, వాహనాలకు తీవ్ర నష్టం**
**-రష్యాకు శిక్ష తప్పదని జెలెన్‌స్కీ హెచ్చరిక**
**-అత్యవసర సహాయక చర్యలు ముమ్మరం చేసిన ఉక్రెయిన్ ప్రభుత్వం**


కీవ్:



ఉక్రెయిన్‌లోని కీవ్ ప్రాంతంపై రష్యా జరిపిన దాడిలో మృతుల సంఖ్య 37కు పెరిగిందని అధికారులు శనివారం తెలిపారు. ఖార్కీవ్ జిల్లాలోని హెచ్‌ఆర్ గ్రామంలో రింగ్‌రోడ్డుపై శుక్రవారం సాయంత్రం సుమారు ఎనిమిది గంటలకు రష్యా డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడి కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగి ఆత్యవసర సేవల సిబ్బంది తక్షణమే మంటలను అదుపు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. రింగ్‌రోడ్‌లో పలు వాహనాలు దెబ్బతినడం, షాప్‌లు దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొన్నారు. కీవ్ ప్రాంతానికి చెందిన పరిపాలన అధిపతి కైరిలో తిమోషెంకో వివరాలను వెల్లడించారు. రింగ్‌రోడ్డుపై దాడి జరిగి పలువురు గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యాకు తగిన శిక్ష తప్పదని ప్రతీకార హెచ్చరిక చేశారు. కీవ్‌లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాల కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇళ్లు, నివాస ప్రాంతాలు దగ్ధం కాకుండా సామగ్రి దెబ్బతినకుండా నిరోధక నిబంధనలు ఉన్నాయని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికార యంత్రాంగం అత్యవసర ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. మృతుల సంఖ్య 20కి పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరో 42 మంది వివిధ ప్రాంతాల్లో గాయపడ్డారు. వీరిలో పలువురు పిల్లలు ఉన్నారు. గాయపడిన వారందరికీ వైద్య సాయం అందించారు. ఏడుగురిని ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాద ప్రాంతం నుండి 381 మందిని తరలించారు. వీరిలో 59 మంది పిల్లలు ఉన్నారు. దాదాపు 50 నివాస భవనాలు దెబ్బతిన్నాయని ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. కమ్యూనిటీ సమాజ అధిపతి తారస్ విటోవ్ మృతుల్లో ఉన్నారు. ఆయన సాయం అందించేందుకు ముందుగా స్థలానికి చేరుకున్న వేళ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. కమ్యూనిటీలో కార్యాలయం కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రాథమిక వైద్య సహాయం, ఆహారం, మానసిక సేవలు పొందవచ్చు. వైద్యుల రక్షణ, అత్యవసర, శోధన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. స్థానిక పోలీసులు, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

# సినీ కార్మికులకు ఏఐ దెబ్బ

**-జూనియర్ ఆర్టిస్టుల అవకాశాలను మింగేస్తున్న ఏఐ**
**-300 మంది అవసరమైన సీన్‌కు 60 మందితోనే షూటింగ్**
**-డిజిటల్ జనసమూహాలతో పెరుగుతున్న వీఎఫ్‌ఎక్స్ వినియోగం**
**-రోజువారీ కూలీపై ఆధారపడే సినీ కార్మికులకు కొత్త కష్టం**
**-చిన్న పాత్రలే పెద్ద నటులుగా ఎదిగే మార్గానికి ముప్పు**
**-'రామాయణ' ట్రైలర్‌తో వెలుగులోకి వచ్చిన డిజిటల్ క్రౌడ్**
**-తెరపై జనసందోహం.. సెట్లో మాత్రం కొద్దిమందే**
**-టెక్నాలజీ మార్పులతో ఉపాధి కోల్పోయే భయం**



న్యూఢిల్లీ : వాస్తవానికి ప్రతి నటుడికీ ఓ కథ ఉంటుంది. మిథున్ చక్రవర్తి 1970వ దశకం మధ్యలో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేసిన వారే. నవాజుద్దీన్ సిద్ధికీ 'స్కూల్' అనే చిత్రంలో వెయిటర్‌గా ఓ చిన్న పాత్ర వేశారు. ఆ తర్వాత అనేక ఏండ్ల పాటు చిన్న చిన్న వేషాలు, గుర్తింపు లేని పాత్రలు ధరించారు. పంకజ్ త్రిపాఠీ కూడా చిన్న పాత్రలతో సినీ కెరీర్‌ను ప్రారంభించి హిందీ సినిమాకు అత్యంత గుర్తింపు తెచ్చిన నటుల్లో ఒకరయ్యారు. ఇక ఇటీవలి కాలంలో మిహిర్ అహుజాదీ అదే దారి. హృతిక్ రోషన్ నటించిన 'సూపర్ 30'లో ఆయన ఓ చిన్న వేషం వేశారు. ఇప్పుడాయన ప్రేక్షకులకు బాగా సుపరిచితుడైన నటుడు. కల్పలత గుర్తున్నారా ? రాజమౌళి 'బాహుబలి'లో ఎక్స్‌ట్రాగా చేశారు. మాహిష్మతి నివాసితుల్లో ఆమె ఒకరు... అంతే. సినిమాలో ప్రధాన పాత్ర పోషించకపోయినప్పటికీ మంచి గుర్తింపు పొందారు. ప్రేక్షకులతో పాటు నిర్మాతల దృష్టిలో పడిన కల్పలత సాలార్, పుష్ప వంటి చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించారు.

**రోజు గడిస్తే చాలు**

పెద్ద స్టార్‌గా వెలుగొందాలని ముంబయి చిత్రసీమలోని వేలాది మంది వర్ధమాన నటులు, జూనియర్ ఆర్టిస్టులు, ఎక్స్‌ట్రాలకు ఆశలేమీ లేవు. ఎలాగైనా సినీరంగంలోకి ప్రవేశిస్తే చాలు అని వారు అనుకుంటారు. అయితే చాలామందికి ఏండ్లు గడిచినా ఆ కల నెరవేరదు. దీనికి కారణం ఏఐ అంటే ఆశ్చర్యం కలుగుతుంది కదూ. 300 మంది అవసరమయ్యే సన్నివేశాన్ని కేవలం 60 మందితో తీసేయవచ్చు. మిగిలిన పని అంతా డిజిటల్‌గా పూర్తవుతుంది. అప్పుడు మిగిలిన 240 మంది పరిస్థితి ఏమిటి? గుంపులో గోవింద మాదిరిగా సినిమాలో ఒక్క మాట కూడా మాట్లాడే అవకాశం రాని వారు ఎందరో ఉంటారు. అయినా వారు ఇప్పటికీ ముంబయి మహా నగరంలో జీవనాన్ని నెట్టుకొచ్చేందుకు ఈ రోజు గడిస్తే చాలునన్న ఆశతో రోజువారీ వేతనాలపై ఆధారపడుతున్నారు.

# వైసీపీలో నంబర్ 1 సజ్జల

మొదటి తరువాయి

పూర్తి సారాంశం..
వైఎస్సార్సీపీ "కోటరీ" నా మీద "నమ్మక ద్రోహి" అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచార పోస్టులు పెట్టిస్తున్నందున ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను. నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని, సీబీఐ, ఈడీ ఛార్జ్‌షీట్‌లో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌కి నమ్మకస్తుడిని అనే ఒకే ఒక్క కారణంగా జగన్ తో పాటు ప్రతి ఛార్జ్‌షీట్‌లోనూ నన్ను ఏ-2గా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేర్చింది. జగన్ 16 నెలలు జైలులో ఉంటే నన్ను 15 నెలలు జైలులో పెట్టారు. నమ్మక ద్రోహం నా రక్తంలో ఉంటే, అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని. 2024 ఎన్నికల తర్వాత కూడా నాకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో నన్ను ఏ-5గా చేర్చారు. కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2 గా చేర్చారు. ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" పేరు మాత్రం ఇంతవరకు ఏ ఛార్జ్‌షీట్‌లోనూ లేదు. జగన్‌కి వెన్నుపోటు పొడుస్తూ, ఆయనకు తెలియకుండా టీడీపీతో కలిసి ఎలా పని చేయాలో, ఏ కేసులూ లేకుండా ఎలా చేసుకోవాలో అక్కడ ఉన్న "కోటరీ నాయకుడు"కి తెలిసినంత నాకు తెలియదు. నేను ఏనాడూ అలాంటి నమ్మక ద్రోహం పనులు చేయలేదు. ఇప్పుడు పార్టీ మారటానికి రెడీగా ఉన్న "ఉత్తరాంధ్ర నాయకుడు" తో కలిసి ఈ కోటరీ నాయకుడే 2020 నుంచి జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా, నా మీద విపరీతంగా చాడీలు చెప్పించి నన్ను ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించటానికి కారణం అయ్యాడు. జగన్ మెప్పు పొందడానికి నాస్తికుడుగా, కమ్యూనిస్ట్ గా చెప్పుకునే ఇతను వైఎస్సార్సీపీకే కాదు, రాష్ట్రానికే నమ్మకద్రోహి.

ఒక పెద్దిరెడ్డి, ఒక బొత్స, ఒక వైవీ సుబ్బారెడ్డి, ఒక మిథున్ రెడ్డి, ఒక సాయిరెడ్డి అందరూ రీజినల్ కోఆర్డినేటర్స్ గా, సజ్జలని రాష్ట్ర పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ గా మమ్మల్ని మానిటర్ చేయాలని, మేమంతా ఆయనకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు మిగతా నాయకులకు ఆమోదయోగ్యమో నాకు తెలియదు కానీ, నాకు మాత్రం కాదు. అందుకే నా ఆత్మగౌరవాన్ని చంపుకుని పని చేయలేక ... 4సం. రాజ్యసభ పదవీ కాలాన్ని వదులుకొని ... వైసీపీ గుర్తుపై ఎన్నికైనందుకు నైతికసూత్రాన్ని పాటిస్తూ రాజీనామా చేశానని విజయ సాయి రెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు.

# హామీల అమలుకే ప్రథమ ప్రాధాన్యం


మొదటి తరువాయి

శరవేగంగా ఏరియా ఆసుపత్రి అభివృద్ధి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను రూ.34 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల అత్యాధునిక ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 50 శాతం నిర్మాణం పనులు పూర్తయ్యాయి. 4.67 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రిలో ఆధునిక ఐసీయూ, వైద్య పరీక్షా ప్రయోగశాలలు, ఆపరేషన్ థియేటర్లు, 30 పడకల ప్రసూతి విభాగంతో పాటు చిన్నపిల్లలు, కంటి, ఎముకల వైద్యానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు కానున్నాయి. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే పిఠాపురంతో పాటు పరిసరాల్లోని ఆరు మండలాలకు చెందిన సుమారు 3 లక్షల మందికి మెరుగైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ భవనం, మార్చురీ, లక్ష లీటర్ల సామర్థ్యం గల సంప్ తదితర మౌలిక సదుపాయాల పనులు కూడా కొనసాగుతున్నాయి.

# సీఎంలు బంగారం... ఎమ్మెల్యేలు బ్యాడ్..!

**- యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో సర్వేలు వెల్లడి**
**-యోగి సర్కారుపై 41.8 శాతం ఓటర్లు సంతృప్తి**
**--యూపీ ఎమ్మెల్యేలపై 49 శాతం అసంతృప్తి**
**-- మళ్లీ సీఎంగా యోగికి 43 శాతం మద్దతు**
**-- పంజాబ్‌లో మాన్ సర్కారుపై 40 శాతం సంతృప్తి**
**-- ఎమ్మెల్యేలపై 45.3 శాతం అసంతృప్తి**
**--మళ్లీ సీఎంగా మాన్ వైపు పంజాబ్ ఓటర్లు మొగ్గు**
**-- ఉత్తరాఖండ్‌లో సగం మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి**
**-- వచ్చే ఏడాది మూడు రాష్ట్రాలకు ఎన్నికలు**



**న్యూఢిల్లీ:**
2027 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఓటర్లు ముఖ్యమంత్రుల కంటే తమ ప్రాంత ఎమ్మెల్యేలపై ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సర్వేలు వెల్లడించాయి. వోట్ వైబ్ సర్వే ప్రకారం ఈ మూడు రాష్ట్రాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ప్రభుత్వాలపై కంటే ఎక్కువగా ఉంది. అయితే ఈ నియోజకవర్గ స్థాయి అసంతృప్తి పాలక పార్టీలకు ఒకరీతిగా నష్టం కలిగించలేదని ఇండియా టుడే సీవోటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే సూచిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో ఎమ్మెల్యేలపై అసంతృప్తి అత్యధికంగా నమోదైంది. సర్వేలో పాల్గొన్నవారిలో 49 శాతం మంది తమ ప్రస్తుత ఎమ్మెల్యే పనితీరుపై పూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం 27.9 శాతం మంది మాత్రమే సంతృప్తి చెందారు. యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వంపై 41.8 శాతం సంతృప్తి, 38.4 శాతం అసంతృప్తి వ్యక్తమైంది. ముఖ్యమంత్రి ఎంపికలో యోగి ఆదిత్యనాథ్ 43 శాతం మద్దతుతో ముందున్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ 35.5 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు. పంజాబ్‌లో కూడా ఎమ్మెల్యేలపై కోపం ప్రభుత్వంపై కంటే ఎక్కువగా ఉంది. భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై 40 శాతం సంతృప్తి, 35.4 శాతం అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యేలపై అసంతృప్తి 45.3 శాతం, సంతృప్తి 32.2 శాతం మాత్రమే ఉంది. మాదకద్రవ్యాలు, నిరుద్యోగం, వలసలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. భగవంత్ మాన్ ముఖ్యమంత్రి ఎంపికలో బలమైన మద్దతు కలిగి ఉన్నారు. ఆయన పార్టీ ఓటు బ్యాంక్ కంటే వ్యక్తిగతంగా ముందున్నారు. ఉత్తరాఖండ్‌లో కూడా దాదాపు సగం మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై అసంతృప్తి తక్కువగా ఉంది. రాజకీయ విశ్లేషకులు ఎమ్మెల్యేలపై ఈ అసంతృప్తి 2027 ఎన్నికల్లో టికెట్ పంపిణీ, అభ్యర్థుల ఎంపికను ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు. ప్రజాదరణ లేని అభ్యర్థులను మార్చడం, తిరుగుబాటు అభ్యర్థుల ప్రమాదం పార్టీలకు సవాలుగా మారవచ్చు.

# నేపాల్‌లో హృదయ విదారకం

**-బురద మేటలు.. ఆరని కన్నీళ్లు!**
**- ఒక్కొక్కరిది ఒక్కోవిషాద గాథ**
**- వరద మృతులు 682**
**- 2,426 మంది గల్లంతు**
**- పునర్ నిర్మాణానికి 5 బిలియన్ డాలర్లు**
**- భారత్, చైనాలు సాయం చేయాలి**
**- నేపాల్ ఆర్థిక మంత్రి అభ్యర్థన**



**ఖాట్మండ్/న్యూఢిల్లీ:**
నేపాల్‌లో బుధవారం హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో, సునామీలా నీరు, బురద, శిథిలాలు భోటెకోశీ, త్రిశూలి నదుల వెంటబడి ప్రవహించి గ్రామాలను ముంచెత్తాయి. ఆగస్టు 29 సాయంత్రం వరకు నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నవీకరణ ప్రకారం మొత్తం మృతుల సంఖ్య 682కి చేరింది. 2,426 మంది గల్లంతయ్యారు. వీరిలో 517 మంది విదేశీయులు, 933 మంది జలవిద్యుత్ ప్రాజెక్టు కార్మికులు ఉన్నారు. నేపాల్ సైన్యం, పోలీసు సిబ్బంది, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ సిబ్బంది కూడా గల్లంతయ్యారు. చిత్వాన్‌లో 233, రసువాలో 562, నువాకోట్‌లో 115 మంది గల్లంతయ్యారు. 101 మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు 4,451 మందిని రక్షించారు. వారిలో 114 మంది భారతీయులు ఉన్నారు. ఇప్పటికీ కాంటాక్ట్‌లో లేని భారతీయులు 320 మంది ఉన్నారని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. 11 మందితో సహాయక బృందాన్ని పంపించినట్లు వెల్లడించింది. జలవిద్యుత్ సొరంగం నుంచి 191 మందిని, ఎయిర్‌లిఫ్ట్ ద్వారా 517 మందిని తరలించారు. అప్పర్ త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో 100 మందికి పైగా ఇంకా చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. 350 మందిని అక్కడి నుంచి బయటకు తీశారు. చిత్వాన్, నవల్పరాసి తూర్పు, గోర్ఖా, ధాడింగ్, నువాకోట్, తనహు, రసువా జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. భారత్‌లోని నదుల్లో నేపాల్ నుంచి కొట్టుకొచ్చిన ఏడు మృతదేహాలు దొరికాయి. 11 వేలకు పైగా సైనిక, పోలీసు సిబ్బంది రక్షణ పనుల్లో ఉన్నారు. భారత్ వైద్య, సొరంగ రక్షణ నిపుణుల బృందం సాయం అందిస్తోంది. మూడు సాయం విమానాలు ఖాట్మండు చేరుకున్నాయి. వర్షం హెలికాప్టర్ ఆపరేషన్లను ఆటంకపరుస్తోంది. కొత్త సరస్సు ఏర్పడి మళ్లీ వరద ముప్పు ఉందని హెచ్చరికలు ఉన్నాయి. రెడ్‌క్రాస్ అంచనా ప్రకారం 93 వేల మంది ప్రభావితమయ్యారు. ఆసుపత్రుల్లో బంధువులు గల్లంతైన వారి జాబితాలు చూస్తున్నారు. రక్షణ, శోధన పనులు నాలుగో రోజు కొనసాగుతున్నాయి.

సాంకేతిక సాయం కావాలి: నేపాల్ మంత్రి

ఇటీవలి వరదల వల్ల పునర్నిర్మాణానికి 4 బిలియన్ డాలర్ల నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు అవసరమవుతాయని నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే పేర్కొన్నారు. ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని, నష్టం, నష్టపరిమాణం అంచనా వేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మొత్తం నేపాల్ ఆర్థిక వ్యవస్థలో దాదాపు పదో వంతుకు సమానం. 2015 భూకంపం తర్వాత అవసరమైన 9 బిలియన్ డాలర్ల కంటే తక్కువే అవసరమవుతుందని వాగ్లే అన్నారు. సాధారణ రక్షణ పనులకు సాయం అవసరం లేదని, సొరంగ రక్షణ, రవాణా, కమ్యూనికేషన్ పునరుద్ధరణ, మృతదేహాల గుర్తింపు, డిఎన్ఎ పరీక్షలు, శవాల నిల్వకు ప్రత్యేక సాంకేతిక సాయం కావాలని విదేశీ మంత్రి శిశిర్ ఖనాల్ చెప్పారు. భారత్, చైనా తాత్కాలిక వంతెనలు అందించాలని కోరారు.

# గిరిజన ఆరోగ్యానికి సంజీవని

మొదటి తరువాయి



నిర్వహించిన ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన అభివృద్ధికి కొలమానమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య మౌలిక వసతుల కోసం రూ.250 కోట్లతో గిరిజన ఆరోగ్య మౌలిక వసతుల పూర్తి మిషన్‌ను చేపడుతున్నట్లు ప్రకటించారు. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛను అందిస్తున్నామని తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరలకు మందులు అందించే జన ఔషధి కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభరిస్తున్నట్లు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు గిరిజనులకు ఆయుర్వేద వైద్యాన్ని అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తిని స్మరించుకునేలా కొత్తగా నిర్మించిన విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టినట్లు తెలిపారు. థింసా నృత్యంతో గిరిజన యువత గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించడం అభినందనీయమన్నారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సమాచారం, రవాణా అనుసంధానం మెరుగుపడేలా సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

డ్రోన్లతో అత్యవసర ఔషధాలు, వ్యాక్సిన్లు

ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను డ్రోన్ల ద్వారా పెద్ద ఆసుపత్రులకు తరలించి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు సేవలు అందిస్తున్నామని, 104 వాహనాలతో ఉచిత వైద్య సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంటి వద్దే 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాలో ఇప్పటికే సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నామని.. ఇది రాష్ట్రానికే కాకుండా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని అన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం అల్లూరి జిల్లాలో 150 వాహనాలతో అత్యవసర జీవన రక్షణ నెట్‌వర్క్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐదు సూత్రాలతో కార్యాచరణ రూపొందించుకున్నట్లు చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' కింద రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించినట్లు చెప్పారు. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా తాగునీరు అందించడంతో పాటు సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించేలా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో హోమ్‌స్టేల ద్వారా ఆతిథ్య సేవలు అందిస్తే గిరిజన కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. పర్యాటకంలో గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నైపుణ్య శిక్షణ ఇస్తామని.. వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాల్సిన్ది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# ఖర్గే ర్యాలీ చేసిన ప్రదేశంలో శుద్ధి

మొదటి తరువాయి




మల్లికార్జున ఖర్గే కొద్ది రోజుల క్రితం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఒక ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒక వేదిక నుంచి ప్రసంగించారు.అయితే, మరుసటి రోజు కొందరు బీజేపీ అనుకూల నాయకులు ఖర్గే పాల్గొన్న ఆ వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. శుద్ధీకరణ ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఖర్గే మండిపడ్డారు. తాను పాల్గొన్న వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో అక్కడి బీజేపీ ప్రభుత్వంపై కూడా మండిపడ్డారు. తాజాగా ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడారు. ఖర్గే పాల్గొన్న వేదిక ఉన్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటరానితనానికి సూచనగా రాహుల్ అభివర్ణించారు. ఈ చర్య దళితులపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల వైఖరికి నిదర్శనం అన్నారు. దళితుల విషయంలో ఆ పార్టీ నేతలు ఎలా వ్యవహరిస్తారో తెలుస్తోందన్నారు. ఈ చర్యకు పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ప్రధాని చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ విషయంలో ప్రధాని మోదీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వంతోపాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఖర్గే అంశంలో న్యాయం చేయాలని సూచించారు. ఇప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తాము మరింత తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించారు.

# సీఎంతో విభేదాల్లేవ్

మొదటి తరువాయి

మీనాక్షినటరాజన్ ద్వారా ఏఐసీసీకి నివేదిక సమర్పించిందని, అధిష్టానం తదుపరి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. శనివారం టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని అడగనని, మంత్రి పదవి కంటే పీసీసీ చీఫ్ పదవే పెద్దదని చెప్పారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించి ఆ పదవి తనకు కావాలని కోరుకునేంత హీనుడిని కాదని తేల్చి చెప్పారు. వాస్తవానికి బీసీలకు మంత్రివర్గంలో సరైన వాటా దక్కలేదన్నారు. సుస్మిత పటేల్‌కు పార్టీ సభ్యత్వం లేదని, తల్లిగా కుమార్తె విమర్శలను కొండా సురేఖ ఖండించాల్సి ఉందని అన్నారు. కొండా సురేఖకు సంబంధించి తనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయాలను క్రమశిక్షణ కమిటీ తీసుకుందని, అన్ని కోణాల్లో ఆలోచించే క్రమశిక్షణ కమిటీ అధిష్టానానికి నివేదిక సమర్పించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువని, స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పడం ఇక్కడ తప్ప మరేపార్టీలో సాధ్యం కాదన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను విమర్శించిన వారిని సైతం మంత్రి వర్గంలో లేదా పార్టీలో మంచి స్థాయిలో గుర్తింపు ఇచ్చినట్టు గుర్తుచేశారు. బీజేపీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షాలను విమర్శించి బట్టగట్టగలరా అని ఆయన ప్రశ్నించారు. పార్టీలో చేరే సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని పార్టీ హామీ ఇచ్చిందని, నిర్ణయం అధిష్టానానిదేనని అన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎన్నికలకు ముందు ప్రకటించిన గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేకపోతున్నామని, ఎన్నికల నాటివి అన్ని హామీలు పూర్తిచేస్తామని మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కొండా సురేఖ ఓఎస్‌డీగా పనిచేసిన సుమంత్‌ను ఆరేడు నెలల క్రితమే ఉద్యోగం నుంచి ప్రభుత్వం తొలగించిందని గుర్తుచేశారు.

# హెచ్ఐవి నివారణ పద్ధతులను గురించి తెలుసుకోవాలి




**ముమ్మిడివరం, ఆగస్టు 29, ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కరపలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత ఫెడరేషన్ సభ్యులకు కండోమ్ వాడే నైపుణ్యాలు, పరిజ్ఞానం మరియు ఇతర హెచ్ఐవి నివారణ పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ హెచ్ఐవి నివారణ పద్ధతులను గురించి తెలుసుకోవడం అత్యంత అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి మండల స్థాయి ఇంప్లిమెంటరు డి అర్జునరావు మాట్లాడుతూ కండోమ్ వాడే నైపుణ్యాలను గురించి వివరించారు. కండోమ్ సరైన పద్ధతిలో వాడటం ద్వారా మాత్రమే ఉపయోగం ఉంటుందన్నారు. కనుక కండోమ్ ను ఉపయోగించేవారు గడువు తేదీ పూర్తయింది లేనిది నిర్ధారించుకోవాలన్నారు. అదేవిధంగా కండోమ్ ప్యాకెట్లు గాలి ఉందో లేదో నొక్కి చూడాలన్నారు. గాలి ఉన్నట్లయితే కండోమ్ సురక్షితంగా ఉన్నట్లేనని అన్నారు. కండోములను పర్సులో మరియు జేబుల్లో పెట్టుకోవడం ద్వారా నలిగిపోయి పనికిరాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పి.సత్య మాట్లాడుతూ ముందు జాగ్రత్తలు తీసుకోవడం వలన ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ పరిధిలోని స్త్రీ, పురుషులు మరియు బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా హెచ్ఐవి మరియు ఎయిడ్స్ గూర్చి అవగాహన





**అమలాపురం, ఆగస్టు 29, ( నేటి దర్శిని )**
మొబైల్ ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్రలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలోని ఎన్ ఎన్ వి ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు వై వి స్,పాలిటెక్నిక్ మరియు శ్రీ బి ర్ వై వి స్ మరియు శ్రీ నర్సింగ్ కాలేజీ ముక్తేశ్వరం ప్రాంతం, సిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలమరియు విద్యార్థులకు, ప్రజానీకానికి ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు జిల్లా ఎయిడ్స్ నివారణమండలి వారి సహకారంతో జనకల్యాణ్ వెల్ఫేర్ సోసైటీ ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా మొబైల్ సమగ్ర సంచార అవగాహనను దృశ్య శ్రవణ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర ద్వారా ప్రజలకు మరియు యువత కు ఆరోగ్య విషయాలు హెచ్ ఐ వి ఎయిడ్స్ మరియు మాదక ద్రవ్యలపై అవగాహన నివారణ చర్యలు గురించి తెలియజేయడం కోసం ఏర్పాటు చేశారని అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి డి స్ ర్ సి కౌన్సిర్లర్ జి కవిత తెలియజేశారు. జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్స్ మేనేజర్ ప్రాజెక్ట్ మేనేజర్ జి. శ్రీను మాట్లాడుతూ లైంగికశీగా సంక్రమించే వ్యాధులు మరియు కౌన్సిలింగ్ సేవలు మరియు స్థానిక హెచ్ ఐ వి పరీక్ష మరియు వివరాలు సేకరించి వారికీ దీనిపై అవగాహన కల్పించే కార్యక్రమం కాలేజీ విద్యార్థులకు ఎయిడ్స్ రాకుండా తీసుకోవలిసిన జాగ్రత్తలు వాటి యొక్క ప్రమాద పరిస్థితులపై తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రిస్క్ అసెమెంట్ కు సంబందించిన ప్రశ్నాపత్రం క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా చేయాలి అని వివరించారు. ఈ కార్యక్రమంకు కళాశాల ప్రిన్సిపాల్ కె. విశాల్, కె స్వర్ణ, జి ప్రేమలత మరియు జన కళ్యాణ్ వెల్ఫేర్ సోసైటీ ప్రాజెక్ట్ సిబ్బంది ఎం జ్యోతి , పీఠం ఎడ్యుకేటర్ ఎం శ్యామల మరియు అధిక సంఖ్యలో ప్రజానీకం, విద్యార్థులు వీక్షించి విజ్ఞానాన్ని పొందారు.

# హంద్రీనీవా కాలువకు గండి.. అధిక నీటి ఒత్తిడితో గట్టు కోత



**ఉరవకొండ ఆగస్టు 29, ( నేటి దర్శిని )**
అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం, వజ్రకరూరు మండలం ఛాయపురం సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువకు గండి పడింది. రాగులపాడు పంప్‌హౌస్ వద్ద నీటి ఒత్తిడి అధికం కావడంతో కాలువపై నుంచి నీరు ప్రవహించి గట్టు కోతకు గురైంది. పరిస్థితిని గుర్తించిన అధికారులు అప్రమత్తమై మోటార్లను నిలిపివేశారు. ప్రస్తుతం కాలువ పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వజ్రకరూరు మండలం ఛాయపురం సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. రాగులపాడు పంప్‌హౌస్ వద్ద నీటి ఒత్తిడి అధికం కావడంతో కాలువ నిండుగా ప్రవహించింది. ఈ క్రమంలో కాలువ గట్టుపై నుంచి నీరు పొంగిపోవడంతో గట్టు కోతకు గురై గండి పడింది. గతంలో హంద్రీనీవా కాలువ నీటిని రైతులు మోటార్ల ద్వారా పంటల సాగుకు వినియోగించుకునేవారు. అయితే ప్రస్తుతం హంద్రీనీవా నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని అధికారులు స్పష్టం చేశారు. సాగునీటికి వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో రైతులు కాలువ నుంచి నీటిని వినియోగించుకోవడం తగ్గించారు. ఇదే సమయంలో రాగులపాడు పంప్‌హౌస్ నుంచి దాదాపు పది పంపుల ద్వారా నీటిని విడుదల చేయడంతో కాలువలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగినట్లు తెలుస్తోంది. అధిక నీటి ఒత్తిడితో కాలువ గట్టు బలహీనపడి కోతకు గురై గండి పడినట్లు సమాచారం. విషయం గుర్తించిన అధికారులు వెంటనే పంప్‌హౌస్ మోటర్లను తాత్కాలికంగా నిలిపివేశారు. కాలువకు మరింత నష్టం జరగకుండా చర్యలు చేపడుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతు చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

# పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం

**చిట్వేల్, ఆగస్టు 29, ( నేటి దర్శిని )**




: పేద ప్రజల వైద్య ఖర్చులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రైల్వే కోడూరు నియోజకవర్గం చిట్వేల్ మండలం చిట్వేల్ టౌన్‌కు చెందిన గూడూరు జ్యోతికి రూ.51,170 ఆర్థిక సహాయం మంజూరైంది. రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కే.కే. చౌదరి రిఫరల్‌తో ఈ సహాయం మంజూరైంది. మంజూరైన ఆర్థిక సహాయాన్ని జ్యోతి అల్లుడు రమేష్ బాబుకు శనివారం అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తోందని ఈ సందర్భంగా టీడీపీ నాయకులు తెలిపారు. కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ చిట్వేల్ మండల అధ్యక్షుడు కాకర్ల నాగార్జున నాయుడు, సీనియర్ నాయకులు బాలు రామాంజినేయులు నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటేష్ రాజు, యూనిట్ ఇన్‌చార్జ్ బండారు శివ, టౌన్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పగడాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ బర్త్‌డే.. కోడూరులో పొలిటికల్ పవర్ షో..!

- భారీగా జనసేన సన్నాహాలు
- జనసేనాని జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు
- ఎన్డీఏ కూటమి నేతలకు ప్రత్యేక ఆహ్వానాలు
- కార్యకర్తలు, అభిమానులను భారీగా సమీకరించేలా కార్యాచరణ
- కూటమి ఐక్యతకు వేదికగా వేడుకలు
- ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లకు శ్రీకారం



**చిట్వేలు, ఆగస్టు 29, ( నేటి దర్శిని )**
జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు రైల్వేకోడూరులో ఈసారి రాజకీయ సందడి మధ్య ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు రైల్వేకోడూరు ప్రత్యేక వేదికగా నిలుస్తున్న నేపథ్యంలో.. ఈ ఏడాది వేడుకలను మరింత భారీ స్థాయిలో నిర్వహించి పార్టీ బలాన్ని చాటేందుకు జనసేన నాయకత్వం కసరత్తు చేస్తోంది.

**కూటమి బలప్రదర్శనకు వేదిక..!**
పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు జనసేన కార్యకర్తలు, అభిమానులతో పాటు తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలను కూడా పెద్దఎత్తున ఆహ్వానించాలని నిర్ణయించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేలా వేడుకలను నిర్వహించాలని స్థానిక జనసేన నాయకులు భావిస్తున్నారు.
రాబోయే రోజుల్లో స్థానిక రాజకీయాలు మరింత వేడెక్కనున్న నేపథ్యంలో.. ఒకే వేదికపై కూటమి శ్రేణులను సమీకరించడం ద్వారా తమ మధ్య ఉన్న ఐక్యతను ప్రజలకు చాటాలన్నది జనసేన నేతల వ్యూహంగా కనిపిస్తోంది.

**ఇంటింటికీ ఆహ్వానాలు..!**
వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రత్యేక ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేసి ఇప్పటికే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పర్యవేక్షణలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆహ్వాన కమిటీ సభ్యులు పగడాల వరలక్ష్మి, కారుమంచి సంయుక్త, తాతంశెట్టి తులసి తదితరులు మండలాల వారీగా కూటమి నాయకులను కలిసి ఆహ్వానించేందుకు కార్యాచరణ రూపొందించారు.

**అభిమానుల్లో ఉత్సాహం**
పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి అభిమానులు, జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా సమన్వయం చేస్తున్నారు. వేడుకల సందర్భంగా రైల్వేకోడూరులో జనసేన శ్రేణుల బలం, కూటమి పార్టీల మధ్య సమన్వయం ఏ స్థాయిలో ఉందో చాటేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో పవన్ జన్మదిన వేడుకలు ఈసారి కేవలం అభిమానుల సంబరాలకే పరిమితం కాకుండా.. రైల్వేకోడూరు రాజకీయ వేదికపై జనసేన ప్రభావాన్ని చూపించే కార్యక్రమంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.
కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేయాలని నిర్వాహకులు కోరారు.

**పవన్ బర్త్‌డే వేడుకలు..**
రాజకీయంగా ఎలాంటి సందేశాన్ని ఇస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**నాయకులు, కార్యకర్తల సందడి**
ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, మద్దూరి మన్మథ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుపాకుల పెంచలయ్య, పురం సురేష్, షేక్ రియాజ్, ఆనందలతేజ, మలిశెట్టి రమేష్, రాగిపాటి విజయ్, సువారపు హరిప్రసాద్, మహంకాళి నాగేంద్ర, పొన్నారెడ్డి, తుపాకుల శంకర, తుపాకుల రవి చరణ్ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా గుత్తి కోటపై వ్యాసరచన పోటీలు పోస్టర్లు విడుదల

**అనంతపురం ఆగస్టు 29, ( నేటి దర్శిని )**



సెప్టెంబర్ 27న గుత్తిలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గుత్తి కోటపై నిర్వహిస్తున్న వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీల పోస్టర్‌ను శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ గుత్తి కోటను జిల్లా ప్రజలందరూ సందర్శించి దాని చారిత్రక విశేషాలను తెలుసుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో గుత్తి కోటను అతి పెద్ద పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గుత్తి కోట అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా కలెక్టర్ ఆనంద్ చేస్తున్న కృషి అభినందనీయమని గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల ద్వారా విద్యార్థులు, యువతలో గుత్తి కోట చరిత్రపై అవగాహన పెంచడంతో పాటు, కోట విశిష్టతను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవ సలహాదారు, సీనియర్ సిటిజన్ ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి, సమితి సభ్యుడు గట్టు వీరేష్, సాయి తైక్వాండో స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# టాప్ ట్రైనింగ్ స్పీకర్‌గా కె.కె. చౌదరి

- చంద్రబాబు చేతుల మీదుగా సైకిల్ మెమెంటో, ప్రశంసా పత్రం




**చిట్వేల్, ఆగస్టు 29, ( నేటి దర్శిని )**
టీడీపీ శిక్షణ తరగతుల్లో టాప్ ట్రైనింగ్ స్పీకర్‌గా రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కె.కె. చౌదరి నిలిచారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనను అభినందించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో గత పది నెలలుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు 50 బ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన స్పీకర్లతో చంద్రబాబు సమావేశమయ్యారు. 50 బ్యాచ్‌లలో 46 బ్యాచ్‌లకు హాజరై శిక్షణ ఇచ్చిన కె.కె. చౌదరిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. టాప్ ట్రైనింగ్ స్పీకర్‌గా నిలిచినందుకు కె.కె. చౌదరికి చంద్రబాబు సైకిల్ మెమెంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కె.కె. చౌదరి మాట్లాడుతూ పార్టీ శిక్షణ తరగతుల్లో టాప్ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రశంసలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత కృషి చేస్తానని తెలిపారు. శిక్షణ తరగతులకు సహకరించిన పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ చిరంజీవి, సమన్వయ సభ్యులు, సిబ్బంది, సహచర శిక్షణ వక్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి

**అనుముల, ఆగస్టు 29, ( నేటి దర్శిని )**
అనుముల మండలం బ్లాక్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ షేక్ ఖాసీం గారి తండ్రి ఇటీవల మృతి చెందారు . ఈ విషయం తెలుసుకున్న సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ,11 వ రోజు దిన కర్మలకూ హాజరై చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ తదితరులు హాజరయ్యారు.



# యూట్యూబ్‌లో దూసుకుపోతున్న సుమంత్ 'మహేంద్రగిరి వారాహి' ట్రైలర్

టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు.పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన




గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.



## కియారా అద్వానీ హాట్ బాంబ్..

# ఆ హీరో అంటే పిచ్చి.. అతనితో మూవీ డేట్‌కు వెళ్తా..!

## -ఓపెన్‌గా చెప్పిన మీనాక్షి



టాలీవుడ్‌లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకుపోతోంది పంజాబీ ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', అనగనగా ఒక రాజు వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంటూ ఇండస్ట్రీలో 'లక్కీ ఛామ్'గా మారిపోయింది. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ విజయ్ దళపతి సరసన నటించి అక్కడి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఆచి తూచి సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. కాగా గతంలో ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో.. "ఒకవేళ మీరు సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా 'మూవీ డేట్' (సినిమాకు వెళ్లడం) కి వెళ్లాల్సి వస్తే.. ఎవరిని ఎంచుకుంటారు?" అని యాంకర్ అడగ్గా ఆసక్తికర సమాధానం చెప్పింది.ఆ ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం తడుముకోకుండా, ఎంతో ఉత్సాహంగా కోలీవుడ్ స్టార్ హీరో శింబు పేరును చెప్పింది. "నేను మూవీ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఖచ్చితంగా శింబు సార్‌తోనే వెళ్తాను" అంటూ చాలా ఎగ్జైటింగ్‌గా సమాధానం ఇచ్చింది. శింబు స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన నటన అంటే తనకు చాలా ఇష్టమని ఈ బ్యూటీ పేర్కొంది. శింబుపై మీనాక్షి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.గతంలో శింబు, మీనాక్షి ప్రేమలో ఉన్నారంటూ వార్తలు వచ్చాయి. కానీ దీని పై ఇద్దరూ స్పందించలేదు. అయితే ఇప్పుడు శింబుతోమూవీ డేట్‌కువెళ్తా అని మీనాక్షి చెప్పడంతో ఫ్యాన్స్ అవాక్‌అవుతున్నారు . ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఒక సినిమా వస్తే చూడాలని ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, ప్రస్తుతం కోలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం... దర్శకుడు అశ్వత్ మరిముత్తు నేతృత్వంలో శింబు నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'ఎస్‌టీఆర్ 49' లో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసినట్లు టాక్ నడుస్తోంది.

# కింగ్ 100 గ్లింప్స్ విడుదల..

## పవర్ ఫుల్ డైలాగ్‌తో హీరో పరిచయం


అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున




పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు.గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.

# టాలీవుడ్‌లో తెలంగాణ జానపదాల హోరు..

## 'రాములో రాముల, సారంగదరియా.. యెష నాగుల కట్ట' అన్నీ హిట్సే..!



తెలంగాణ సంప్రదాయాలు, ఇక్కడి పల్లెపదాలకు టాలీవుడ్ జై కొడుతోంది. మన ప్రాంతంలోని ఆచార వ్యవహారాలకు భావోద్వేగాలు జోడించిన వేణు ఎల్దండి 'బలగం' సినిమా ఎంతపెద్ద హిట్టో తెలిసిందే. ఇప్పుడు వేణు ఎల్లమ్మతో వస్తుండగా.. తెలంగాణ ఈ ప్రాంత చరిత్రతో తెరకెక్కిన 'రాజన్న', 'ఛాంపియన్' వంటి చిత్రాలు ఆదరణ పొందగా.. తెలంగాణ యాసతో వరసగా హిట్స్ అందుకున్నారు విజయ్ దేవరకొండ, సిద్దూ జొన్నలగడ్డ. ఇదే ఒరవడికి కొనసాగింపుగా.. మన జానపదాలు ఈమధ్య వెండితెరపై ప్రభంజనం సృష్టిస్తున్నాయి.తెలంగాణ ప్రజలు మాత్రమే పాడుకునే, విని తరించే హిట్ జానపదాలను ఏరికోరి సినిమాలో పెడుతున్నారు దర్శకులు. కొన్నింటికి స్వరకర్తలు కొత్త బాణీలు కడుతుండగా.. హీరోలతో కొరియోగ్రాఫర్లు మాస్ స్టెప్పులేయిస్తున్నారు. 'లవ్ స్టోరీ' చిత్రంలో 'సారంగదరియా' సాంగ్ బ్లాక్‌బస్టరైంది. నాగచైతన్య హీరోగా, శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించి ఈ సినిమాలోని ఈ పాటకు సాయి పల్లవి నృత్యం ప్లస్ అయింది.ఇక 'అల వైకుంఠపురం'లో మంగ్లీ పాడిన రాములో రాముల పాట ఎంత హిట్టో తెలిసిందే. తెలంగాణ పదాలను, యాసను మేళవిస్తూ కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటకు.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, పూజా హెగ్డే స్టెప్పులు ఇరగదీశారనుకో. ఇప్పటికే ఈ పాట యూట్యూబ్‌లో 79 కోట్లకు పైగా వ్యూస్ సాధించింది.మెగాస్టార్ చిరంజీవి 'భోళా శంకర్' చిత్రంలో 'నర్సపల్లి గండిలోన గంగధారి ఆడి నెమలి ఆటలకు గంగధారి' అనే జానపద లైన్స్ తీసుకున్నారు. ఈ సాంగ్‌కు చిరంజీవి, తమన్నా, కీర్తి సురేశ్ డ్యాన్స్ కుమ్మేశారు. రవితేజ 'రాజా ది గ్రేట్' సినిమాలోని 'గున్నా గున్నా మామిడి' సాంగ్ ఎంత పాపులరో తెలిసిందే. ప్రస్తుతం. నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ప్యారడైజ్' సినిమాలో 'యెష నాగుల కట్ట మీద యేసిన ఉయ్యాల' పాటను తీసుకున్నారు. తాజాగా దీనికి సంబంధించిన లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదలైంది.నాని, కీర్తి సురేశ్‌లు ఈ సాంగ్‌కు వేసిన మాస్ స్టెప్టులు.. ఈ ఫోక్ సాంగ్‌ను మరింతగా జనాల్లోకి తీసుకెళ్లడం ఖాయం. ఒకప్పుడు టేపు రికార్డర్‌లో విన్న ఈ పాటలు.. యూట్యూబ్ ఛానెళ్ల పుణ్యమాని ఈతరానికి కూడా చేరువయ్యాయి. కథను బట్టి.. ఈ ప్రాంత విశిష్టతను చాటుతున్న ఈ ఫోక్ సాంగ్స్ ట్రెండ్ సినిమా హిట్ ఫార్ములాలో భాగమైపోయింది.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450